క్లుప్తంగా

రేపు జగనన్నకు చెబుదాం

కొల్లూరు: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిబాబు బుధవారం తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాల వద్ద నున్న ఎంప్లాయీస్ రిక్రియేషన్ హోంలో నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, తమ శాఖల పనితీరుకు సంబంధించిన నివేదికలతో హాజరు కావాలని కోరారు. ప్రజల సమస్యలను నమోదు చేసేందుకు సచివాలయాల వారీగా సిబ్బందిని కేటాయించి కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

భట్టిప్రోలు: మండల పరిధిలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని భట్టిప్రోలు ఎస్‌ఐ అంబటి చంద్రశేఖర్ బుధవారం హెచ్చరించారు. ఎక్కడైనా పేకాట, కోడి పందేలు, నెంబర్లాట తదితర ఆటలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

పీఎం విశ్వకర్మ పథకం ప్రాథమిక లక్ష్యం ఉపాధి

భట్టిప్రోలు: ఉపాధి మార్గాలను సృష్టించడమే ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ప్రాథమిక లక్ష్యమని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. భట్టిప్రోలులోని మండల పరిషత్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ పథకం ఏపీ వడ్రంగి అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ కన్వీనర్ కోడూరు వెంకటేశ్వరరావు కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేయించుకున్న ధ్రువీకరణ పత్రాన్ని బుధవారం ఎంపీపీ లలిత కుమారి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావుల చేతుల మీదగా అందుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జలజ, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో 31 రకాల పరీక్షలు ఉచితం

భట్టిప్రోలు: భట్టిప్రోలు పీహెచ్‌సీలో 31 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి తెలిపారు. బుధవారం ఆమె తన చాంబర్‌లో మాట్లాడుతూ ఈ పరీక్షలు ప్రైవేట్ వైద్యశాలల్లో చేయించుకుంటే వేలాది రూపాయలు అవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పీహెచ్‌సీలో ఈ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

తహసీల్దార్‌కు ఎండీఓ ఆపరేటర్ల వినతి

భట్టిప్రోలు: రేషన్ వాహనాల ఎండీయూ ఆపరేటర్లకు ఆరు నెలల బకాయిలు విడుదల కోరుతూ తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావుకు బుధవారం వినతి పత్రం అందించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కోనేటిపురం(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయంపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరి పంట పొలంలో నాము తెగులు, రసం పీల్చే పురుగులను గుర్తించారు. దీని నివారణకు పేడ మూత్రం, ఇంగువ ద్రావణం, దశపర్ణి కషాయం తయారు చేసుకుని పిచికారీ చేయడం ద్వారా పురుగులను అరికట్టవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల నుంచి జిల్లా స్థాయి మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్ అధికారి(డీఎల్‌పీఎం) మోహన్, సూరేపల్లి, ఐలవరం యూనిట్లకు చెందిన క్యాడర్ల ఏటీఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంటీలు బాలా, పాప, డి.ఝాన్సీరాణి, సురేష్, పండు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

పెదనందిపాడు: విద్యార్థిపై దాడి చేసి కులం పేరుతో దూషించిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాలపర్రు గ్రామానికి చెందిన అన్నలదాసు ప్రతాప్ నాగులపాడు శ్రీనివాస హైస్కూల్ లో 10 వ తరగతి చదువుతున్నాడని, పెదనందిపాడు గ్రామానికి చెందిన బలుసుపాటి కామేష్ అనే యువకుడితో జరిగిన చిన్న గొడవ నేపథ్యంలో ప్రతాప్‌ను కులం పేరుతో దూషించి, దాడి చేసారని, ఈ దాడిలో గాయపడిన ప్రతాప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

లారీ ఢీకొని తండ్రీ, కుమార్తెలకు తీవ్ర గాయాలు

తెనాలి రూరల్: లారీ ఢీకొని తండ్రి, కుమార్తె తీవ్రంగా గాయపడిన ఘటన తెనాలిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం కఠెవరానికి చెందిన ప్రియ తెనాలిలోని ప్రైవేటు బ్యాంకులో శిక్షణ పొందుతోంది. తండ్రీ నారాయణరావుతో కలసి బుధవారం యాక్సెస్ స్కూటర్‌పై తెనాలి వస్తుండగా సాయిబాబా గుడి సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. వీరి వాహనం లారీ కింద ఇరుక్కు పోయి కొంత దూరం ఈడ్చుకెళ్లింది. తండ్రీ, కుమార్తెలకు త్రుటిలో ప్రాణాపాయం తప్పి తీవ్ర గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వెంటనే ఇద్దరినీ ప్రైవేటు వైద్యశాలకు పంపారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం



రేపల్లె 23వవార్డులో విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ తదితరులు



రేపల్లె పట్టణం 6వవార్డులోని విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు

వినాయక నిమజ్జనం బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. 23వ వార్డులో కౌన్సిలర్ తులసీ దుర్గా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినా యక విగ్రహం వద్ద మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 24వ వార్డు లోని సుభాష్ చంద్రబోస్ గణేష్ భక్తబందం, 6వ వార్డులో శ్రీ విజయ గణేష్ భక్త బృందం ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని లడ్డూ పాటలు నిర్వహించి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనానికి పెనుమూడి రేవు వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రేపల్లె రూరల్

సాధన మండలిలో రుషి పంచమి వేడుకలు

భట్టిప్రోలు: భద్రపద శుద్ధ పంచమినాడు మహారుషులను గౌరవించి, పూజించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ గుంటూరు, కృష్ణా జిల్లాల అధ్యక్షులు గడ్డిపాటి శ్రీనివాసరావు(వాసు)పేర్కొన్నారు. భట్టిప్రోలు సాధన మండలి, బ్రహ్మ విద్యాశ్రమంలో బుధవారం రుషి పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్తలు ఏడుగురిని సప్త రుషులుగా భావించి భక్తి చైతన్య స్వామీజీ (విజయవాడ), భాస్కర స్వామీజీ(కపిలేశ్వరం), జానపాటి లీలావేణుగోపాల శర్మ(ధూళిపూడి), రామిశెట్టి నరసింహారావు(బాపట్ల), మునివర యోగి(విజయవాడ), పేరి శాస్త్రి(నరసరావుపేట), వేమినేని వెంటేశ్వర రావు (అద్దంకి పాలెం)లను పూజించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి ప్రధాన కార్యదర్శి కోట యశోద దేవి, నిర్వాహకులు పులికొండ దేవసేన ఆండాళ్, మాటూరు గృహలక్ష్మి, ఆత్మూరి సునీత, చుండూరు బాబు, బండి వెంకట్రావు, జవ్వాది శంకరరావు, తూనుగుంట్ల ఈశ్వరుడు పాల్గొన్నారు.



భట్టిప్రోలు సాధన మండలిలో నిర్వహించిన కర్పూర యజ్ఞంలో పాల్గొన్న సప్త రుషులు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెదలంక(భట్టిప్రోలు): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలం పెదలంక మధ్యగూడేనికి చెందిన దున్నా కిరణ్ కుమార్(35) గృహ నిర్మాణ పనులు చేస్తుంటాడు. ఇంటికి ఆనుకుని మరో గదిని నిర్మిస్తుండగా స్లాబ్ సెంట్రింగ్ చెక్కలు ఊడదీసే క్రమంలో అతడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే వైద్యశాలకు తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందాడు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ అంబటి చంద్రశేఖర్ పరిశీలించారు. మృతుడు భార్య దున్నా అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ అంబటి చంద్రశేఖర్

ఉత్సాహభరితంగా క్రీడాకారుల ఎంపిక పోటీలు

రేపల్లె రూరల్: పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ హైస్కూలు గ్రౌండ్‌లో రేపల్లె మండల స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ పోటీలు బుధవారం నిర్వహించారు. మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ యడ్ల రమేష్‌బాబు మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిడ్, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ విభాగాలలో బాల, బాలికలకు విడివిడిగా ప్రతి క్రీడలో అండర్-14, అండర్-17 విభాగాలలో ఎంపికలు నిర్వహించినట్లు చెప్పారు. పోటీలలో ఎంపికైన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపుతున్నట్లు చెప్పారు. ఈ నెల 22, 23 తేదీలలో రేపల్లె నియోజకవర్గ స్థాయి పోటీలు మోంట్‌ఫోర్ట్ స్కూలులోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా మండలాలకు చెందిన క్రీడాకారులు పోటీలలో పాల్గొనదలచిన తమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అందించే ధ్రువీకరణ పత్రం ద్వారా హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9908195547 నంబరును సంప్రదించాలని కోరారు.



కబడ్డీ ఆడుతున్న బాలికలు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

గుంటూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.ఆదినారాయణ తెలిపారు. బుధవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లాలుపురం, వెంగళాయపాలెం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు పరిసరాలు పరిశుభ్రత తదితర విషయాలను వివరించారు. పంచాయతీ సిబ్బందికి తడిచెత్త, పొడిచెత్త సేకరణ తదితర అంశాలను వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పారిశుధ్యం, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఓ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ అశ్విన్, పంచాయతీ కార్యదర్శి మీనాక్షి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

- క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం అభినందనీయం
- విద్యార్థి దశ నుంచే ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

పెదకాకాని: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం అభినందనీయమని గుంటూరు, కృష్ణా జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన ఆటల పోటీలు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శరీరానికి మంచి వ్యాయామాన్ని ఇస్తాయన్నారు. క్రీడాకారుల మధ్య స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించడం ద్వారా ఉత్తమ క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఈ పోటీలను ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించడాన్ని అభినందించారు. క్రీడా మైదానంలో క్రీడా వేదికను సొంత నిధులతో నిర్మించడానికి ముందుకు వచ్చిన బండి అశోక్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని అనంతరం పోటీలను ప్రారంభించారు. గుంటూరు రీజియన్ వ్యాయామ విద్యాపర్యవేక్షకుడు షేక్ బాషా క్రీడల నిర్వహణ, వసతుల కల్పన పట్ల హర్షం వ్యక్తం చేశారు. మూడు మండలాల నుండి వచ్చిన క్రీడాకారులకు భోజన, వసతి కల్పించి క్రీడలు విజయవంతం కావడానికి పాఠశాల హెచ్‌ఎం తిరుపతిరావు ప్రోత్సహించారు. క్రీడల నిర్వహణను పాఠశాల పీఈటీ మస్తాన్‌రెడ్డి పర్యవేక్షించగా 30 మంది వ్యాయామోపాధ్యాయులు క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లో పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలాల నుండి అండర్ 14, అండర్ 17 బాల బాలికలు 200 మంది పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, బాల్ బాడ్మింటన్, షెటిల్, టెన్నికాయిడ్, యోగా, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన క్రీడాకారులతో నియోజకవర్గ స్థాయి టీంలను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని రాణించేలా తీర్చిదిద్దడం జరుగుతుందని పీడీ మస్తాన్‌రెడ్డి వివరించారు. క్రీడల పోటీల విధుల్లో ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, జోసఫ్, జ్యోతి, ఇంద్రావతి పాల్గొన్నారు.



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డీ యాకోబుకు తమ యూనివర్సిటీ బుధవారం పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పీ నాగభూషణ్ తెలిపారు. యాన్ ఎఫిషియంట్ క్రిప్టో-స్కీమ్ ఫర్ ప్రైవసీ ప్రిసర్వేషన్ ఆఫ్ అన్‌స్ట్రక్చర్డ్ టెక్స్ అండ్ స్ట్రక్చర్డ్ డేటా ఇన్ పబ్లిక్ క్లౌడ్ అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేశారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డీ యాకోబును పలువురు అభినందించారు.

విద్యార్థులకు స్ఫూర్తినిస్తున్న టెడ్ఎక్స్ వీవీఐటీ

పెదకాకాని: వీవీఐటీ విద్యార్థులు నిర్వహించిన టెడ్ ఎక్స్ వీవీఐటీ చేజింగ్ వరల్డ్ (మారుతున్న ప్రపంచం) విద్యార్థులలో స్ఫూర్తి నింపడం, ప్రేరణ కలిగించే విధంగా సాగిందని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన 9 మంది వక్తలు వారి జీవితానుభవాలను, అధిగమించిన సవాళ్ళను విద్యార్థులకు వివరించారు. జీవితంలో సవాళ్ళు ఎదురైనపుడు వాటిని అధిగమించి ఏ విధంగా ముందుకు సాగాలో తెలియజేస్తూ వక్తలు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు అంశాలపై అవగాహన కలిగించి క్లిష్ట సమయాల్లో సరైన మార్గాలు ఎన్నుకునే విధంగా విద్యార్థులలో ప్రేరణ కలిగించేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ముఖ్య వక్తలుగా ప్రముఖ చైల్డ్ సైకాలజిస్ట్ ఫూగ్‌ధాని మన్సీ, ట్రెయిన్ మై బ్రెయిన్ వ్యవస్థాపకురాలు, రచయిత అనిష్ బెహేటీ, టెస్టింగ్ సాఫ్ట్‌వేర్ నిపుణుడు భగేశ్వర్ మోహన్, స్టెమీపై గాల్స్ ఫౌండర్ అనీషా మర్రెపు, గిన్నీస్ వరల్డ్ రికార్డ్ అందుకున్న లఘుచిత్ర దర్శకుడు దీపక్‌రెడ్డి, ప్రముఖ నటి సభా నటేష్, ఆర్కిటెక్ అశ్విని శ్వేత, విద్యార్థులు హర్ష, సమీరాలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, టెడ్ఎక్స్ సంధానకర్త పాలపర్తి బిందు మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నంబూరు వీవీఐటీలో స్ఫూర్తి నింపుతున్న ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన వక్తలు

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

గుంటూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పెదపలకలూరు గ్రామానికి చెందిన కుందురు మల్లేశ్వరరావుకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వారిలో రెండవ కుమార్తె సుకన్య(17) బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని సమాచారం మేరకు ఘటన స్థలికి పోలీసులు చేరుకున్నారు. ఘటన జరిగిన తీరును పరిశీలించి మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పవన్‌కల్యాణ్ స్థాయి మరిచి విమర్శలు చేయటం సరికాదు

బాపట్లటౌన్: పవన్‌కల్యాణ్ స్థాయి మరిచి విమర్శలు చేయటం సరికాదని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిగా జగనన్నే గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సుభానీ, ఈ.శ్రీనివాసరావు, చెరుకుపల్లి ప్రభుదాసు, దిండుబోయిన శ్రీనివాసరావు, దోలా కృష్ణారెడ్డి, తోట సతీష్, అక్కల కృష్ణారెడ్డి, విష్ణు, డి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని కృష్ణాకెనాల్ పరిధిలో రైల్వేస్టేషన్ శివారులో ఓ యువకుడు రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. యర్రబాలేనికి చెందిన నాగేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు మంత్రి వంశీ (24) అమ్మమ్మ నాగేశ్వరమ్మ దగ్గర ఉంటున్నాడు. తండ్రి మంత్రి నాగేశ్వరరావు వంశీ చిన్నతనంలోనే ఇంట్లోంచి వెళ్లిపోయాడు. తల్లి శ్రీలక్ష్మి రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి అమ్మమ్మతో కలసి ఉంటున్నాడు. 10వ తరగతి చదువుకున్న వంశీ విజయవాడలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తూ అమ్మమ్మను చూసుకుంటూ ఈ మధ్యకాలంలో ఇంటిని కూడా కొనుగోలు చేశాడు. ఏం జరిగిందో తెలియదు కానీ మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో ంచి వెళ్లిపోయాడని అమ్మమ్మ నాగేశ్వరమ్మ తెలిపింది. ఉదయం వంశీ స్నేహితులకు తను ఉన్న ప్రాంతాన్ని సెల్‌ఫోన్ ద్వారా లొకేషన్ షేర్ చేసి రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితులు లొకేషన్ ఆధారంగా ఘటనా స్థలానికివచ్చి పరిశీలించగా అప్పటికే వంశీ మృతి చెంది కనిపించాడు. తెనాలి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిమిత్తం తెనాలి రైల్వే ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

ఆరోగ్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

భట్టిప్రోలు: వైద్య ఆరోగ్య సిబ్బంది విధిగా సమయ పాలన పాటించాలని హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ(హెచ్‌డీఎస్) చైర్మన్, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో కమిటీ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్యశాలలో రక్తపరీక్షల నిర్వహణ, పీహెచ్‌సీని సూచించే బోర్డు, అభివృద్ధి కమిటీకి సంబంధించిన బోర్డు విధిగా ఉండాలని కోరారు. భట్టిప్రోలు-1 ఉపకేంద్రం శిథిలావస్థలో ఉందని, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బంది సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ పద్మజ, సభ్యులు డి.వెంకటేశ్వరరావు(తహసీల్దార్), గుమ్మా చంద్రశేఖరరావు(ఎంపీడీఓ), దారా రవి కిరణ్మయి(సర్పంచి), టి.ఉదయభాస్కరి(జెడ్పీటీసీ సభ్యురాలు), మోర్ల విజయలక్ష్మి(సర్పంచి- సూరేపల్లి) పాల్గొన్నారు.



హెచ్‌డీఎస్ సమావేశంలో పాల్గొన్న చైర్మన్, ఎంపీపీ లలిత కుమారి

పెయ్యదూడల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె రూరల్: లింగ నిర్ధారిత వీర్యం పెయ్యదూడల పథకం మండలంలో విజయవంతంగా అమలవుతున్నట్లు బొబ్బర్లంక పశువైద్యశాల వైద్యుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలో ఈ పథకం ద్వారా 16 పశువులకు లింగ నిర్ధారిత కణాలను విజయవంతంగా ప్రవేశపెట్టగా తుమ్మలకు చెందిన గరికపాటి రమేష్ పశువులు మంగళవారం పెయ్యదూడకు జన్మనిచ్చిందని చెప్పారు. బుధవారం ఆ పశువులను పరిశీలించారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో రూ.500 చెల్లించి పెయ్యదూడల వీర్యకణాలను పశుపోషకులు తమ పశువులకు అందించవచ్చన్నారు. పశువులకు గర్భధారణ నిలవని పక్షంలో సంబంధిత రైతు ఖాతాలో వారు చెల్లించిన రూ.500 జమ చేయబడునని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి భానుకోటి, సచివాలయ కన్వీనర్ దేవరకొండ అనిల్, సర్పంచి దీపిక, వార్డు మెంబర్ గాదె మణీంద్ర, గోపాలమిత్ర శివకృష్ణ పాల్గొన్నారు.



పెయ్యదూడలను పరీక్షిస్తున్న పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు

జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్

చెరుకుపల్లి: రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు లాభాలు కూడా పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని నడింపల్లిలో ప్రకృతి విధానంలో సాగు పొలాలను బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు అనవసరంగా ఎక్కువ మోతాదుతో పురుగు మందులు వాడటం వలన అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో పాటు రైతులపై ఎక్కువ ఆర్థిక భారం పడుతుందన్నారు. అంతే కాకుండా భూమి సారం కోల్పోతుందని చెప్పారు. అందువల్ల రైతులకు ఖర్చు తగ్గించి నాణ్యమైన పటలను పండించేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతో తోడ్పడుతుందని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ కింద సాగు పొలాలను పరిశీలిస్తున్న అబ్దుల్ సత్తార్

25 నుంచి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. బుధవారం భట్టిప్రోలు ఏఐటీయూసీ కార్యాలయంలో మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్లలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రారంభం సందర్భంగా కూలిదండు మహా ప్రదర్శన, అనంతరం రథంసెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు బీకేఎంయూ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెల్లి విల్సన్, ఆవుల శేఖర్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, నాయకులు వి.శ్రీనివాసరావు, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



వ్యవసాయ కార్మిక సంఘం మహా సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భరోసా

- మండలంలో కొనసాగుతున్న ఇంటింటి ఆరోగ్య సర్వే
- ఈ నెల 30 నుంచి గ్రామాలు, పట్టణంలో వైద్య శిబిరాలు
- గ్రామాలలో 16, పట్టణంలో 3 వైద్య శిబిరాలు
- నిపుణుల పర్యవేక్షణలో వైద్య సేవలు

పొన్నూరు: పేదలందరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో తమ ఇంటి వద్దనే వైద్య సేవలను అందించే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సెప్టెంబర్ 30 నుంచి అక్టోబరు 27 వరకూ ప్రతి గడపకూ తీసుకెళ్లనున్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16వ తేదీ నుంచి వలంటీర్లు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి ఇంటింటి ఆరోగ్య సర్వే చేస్తున్నారు. ఈ నెల 29 వరకు జరిగే సర్వేలో ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సురక్ష ఉద్దేశాన్ని ప్రజలకు వివరిస్తూ ఇంటిలో ఉన్న కుటుంబసభ్యుల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ అందజేస్తున్నారు. కొన్ని పరీక్ష (బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, మలేరియా, డెంగీ, కళ్లె) లను ఇంటి వద్దనే చేస్తారు. ఈ పరీక్షల్లో గుర్తించిన వ్యాధులకు అవసరమైన మందులను ఇంటి వద్దనే అందజేస్తారు. అనంతరం గ్రామాల్లో జరిగే మెగా వైద్య శిబిరాలలో మరలా వారికి ఆరోగ్య పరీక్షలు చేయడం జరుగుతుంది.

30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు..

ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం ప్రతి గ్రామంలో జరుగనుంది. శిబిరంలో ఇద్దరు ప్రత్యేక వైద్యులతో పాటు మరో ఇద్దరు జనరల్ వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించనున్నారు. రోగులకు పరీక్షలు నిర్వహించి వైద్య చికిత్స అవసరం ఉన్న వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యశాలకు రిఫర్ చేసి వైద్యాన్ని అందిస్తారు. అక్టోబరు 27 వరకు శిబిరాల నిర్వహణ జరుగుతుంది.



ఇంటింటి సర్వేలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భట్టిప్రోలు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. విద్యుత్ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.